కుక్కలు కరిచేస్తున్నాయ్

కుక్కలు కరిచేస్తున్నాయి.. వెంట పడి మరీ పిక్కలు పట్టుకుంటున్నాయి.. వాహనాలపై వెళ్తే రోడ్డుకు అడ్డంగా వచ్చి మీద పడుతున్నాయి.. రోడ్డు మీద నడిచి వెళ్లే చిన్నారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు హడలి పోతున్నారు. కుక్కలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.


77వ వార్డు పిట్టవానిపాలెంలో వీధికుక్కల గుంపు

● నాలుగు నెలల్లో దాదాపు 500 మందికి గాయాలు ● పీహెచ్‌సీలకు పరుగులు ● భయపడుతున్న ప్రజలు


నడుపూరు ఎస్సీ కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

కుక్క కాటు కేసులు ఇలా..

ఆస్పత్రి	నెలకు బాధితులు
పెదగంట్యాడ పీహెచ్‌సీ	50 నుంచి 60
సిద్దేశ్వరం యూపీహెచ్‌సీ	28 నుంచి 30
గంగవరంలో యూపీహెచ్‌సీ	10 నుంచి 12
దేవాడ పీహెచ్‌సీ	20 నుంచి22
నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీ	25 నుంచి 27

పెదగంట్యాడ: మండలంలోని నడుపూరు, సిద్దేశ్వరం, దయాల్‌నగర్, నెల్లిముక్కు, పిట్టవానిపాలెం, నమ్మిదొడ్డి, మదీనాబాద్ ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కొత్తవారు వీధుల్లోకి వస్తే వెంటపడుతున్నాయి. చిన్నపిల్లలు, వృద్ధులపై తెగబడుతున్నాయి. దీంతో ఒంటిరిగా వీధుల్లోకి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. నాలుగు నెలల్లోనే దాదాపు 500 మంది కుక్క కాటుకు గురయ్యారంటే తీవ్రతకు అర్థపడుతోంది. . పెదగంట్యాడ, సిద్దేశ్వరం, గంగవరంతో పాటు నమ్మిదొడ్డి యూపీహెచ్‌సీ కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఓ చోట కుక్క కరిచిదంటూ బాధితులు పీహెచ్‌లకు పరుగులు తీస్తున్నారు. అయితే వ్యాక్సిన్ ఉండడంతో బాధితులకు వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నారు.

నియంత్రణ చర్యలు చేపట్టినా..

మండలంలో కుక్కలను నియంత్రించేందుకు జీవీఎంసీ జోన్-6 జోనల్ ప్రజారోగ్య శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలో వీధి కుక్కలను పట్టుకుని వాటికి వ్యాక్సిన్లు వేసేందుకు వ్యాన్‌తో పాటు సిబ్బంది వీధుల్లో తిరుగుతున్నారు.ఒక వ్యాన్ ఉండడంతో అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోతున్నారు. ప్రతి రోజూ 10 నుంచి 12 కుక్కలను మాత్రమే పట్టుకుని వ్యాక్సినేషన్ చేస్తున్నారు.

గుంపుగా వచ్చి కరిచేశాయి



నేను విధులు నిర్వహించుకుని మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్తుండగా నడుపూరు ఎస్సీ కాలనీ వద్ద కుక్కలు ఒక్కసారిగా వచ్చి దాడి చేసి గాయపర్చాయి. వెంటనే పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ వేయించుకున్నాను. ఎస్సీ కాలనీలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అధికారులు స్పందించి వాటిని నియంత్రించాలి.

–పుచ్చా సంతోష్, నడుపూరు, పెదగంట్యాడ

అందుబాటులో వ్యాక్సిన్



పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు వేసే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. కుక్క కాటు బారిన పడి పీహెచ్‌సీకి ప్రతి రోజూ ఇద్దరి నుంచి ముగ్గురు వరకూ వస్తున్నారు. వెంటనే వారికి వ్యాక్సినేషన్ చేస్తున్నాం. అలాగే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

–డాక్టర్ రమేష్‌బాబు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, పెదగంట్యాడ


కరిచిన గాట్లు

నియంత్రణ చర్యలు చేపడుతున్నాం



కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నాం . జోన్‌కు ఒక వ్యాన్ మాత్రమే ఉండడంతో అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోతున్నాం. ప్రతి రోజూ 10 నుంచి 12 వరకూ కుక్కలను పట్టుకుని వాటికి నరవలో గానీ ఆరిలోవలో గానీ వ్యాక్సినేషన్ చేస్తున్నాం. గాజువాక జోన్‌కు మరో వ్యాన్‌తో పాటు సిబ్బందిని కేటాయించాలని ఉన్నతాధికారులను కోరాం. పెంపుడు కుక్కలకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్లు వేయించాలి.

–డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంవోహెచ్, జోన్-6.

కేసులు పెరిగాయి



దేవాడ పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల కాలంలో కుక్క కాటు బాధితుల సంఖ్య పెరిగింది. ప్రతి రోజూ ఒకరిద్దరూ కుక్క కరిచిందని వస్తున్నారు. వారికి వ్యాక్సినేషన్ చేస్తున్నాం. ప్రజలు కూడా కుక్కకాటు పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచిస్తున్నాం.

–డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా, వైద్యాధికారి, పీహెచ్‌సీ, దేవాడ.

చెత్త తొలగించారు


75వ వార్డు సీతానగరం ప్రధాన కూడలి వద్ద శుభ్రం చేయించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులు స్పందించారు. 75వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చెత్తా చెదారం పేరుకుపోవడంతో స్థానికులు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో సాక్షి దిన పత్రికలో 'పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ జోన్-6 ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ స్పందించారు. ప్రధాన కూడళ్లలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు చేపట్టారు. ఆపై అక్కడ బ్లీచింగ్ చల్లించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

జాతీయ కుడో పోటీలకు అగనంపూడి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

అగనంపూడి: ఈ నెల 5వ తేదీ నుంచి 11 వరకు గుజరాత్‌లోని సూరత్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి కుడో పోటీల్లో అగనంపూడికి చెందిన బాలలు పాల్గొననున్నారు. ఈ మేరకు అగనంపూడి శ్రీనివాసగర్‌లో శనివారం పోటీలకు హాజరుకానున్న 29 మంది బాలి బాలికలను నాయకులు అభినందించారు. హరికృష్ణ ఫిట్‌నెస్ జోన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వీరు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం అభినందనీయమని కిక్ బాక్సింగ్ సంఘం గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. కార్యక్రమంలో కుడో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు శశిధర్, డైరెక్టర్లు అనురాధ, రవిబాబు, శివకాశీరావు, కోటిరెడ్డి, నాగయశ్వంత్, బలిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సారె.. అదిరె


అమ్మవారి సారె ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి ,భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కణితి తెలుకల వీధిలో తెలుకల సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం సారె ఊరేగింపు ఘనంగా జరిపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి , వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ప్రగడ శ్రీనివాసరావు, శంకరరావు, ఆదారి శ్రీను, తెలుకల సంఘం నాయకులు చిత్రాడ వెంకటరమణ, పాలిశెట్టి సత్యనారాయణ, చిత్రాడ సన్యాసిరావు, రాజు, పేరూరి గణేష్, పాలిశెట్టి గోపి, కాంతారావు పాల్గొన్నారు.

హార్టికల్చర్ సొసైటీ పై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ ఉక్కు హార్టికల్చర్ సొసైటీ పెదగంట్యాడ పాలకపక్షం తీరుపై హైకోర్టుకు ఫిర్యాదు చేసినట్టు బాధితురాలు దేవర అప్పలకొండమ్మ తెలిపారు. ఆధార్ కార్డు ఆధారంగా పుట్టిన తేదీని నిర్ధారించి తొలగించడంతో తనకు న్యాయం చేయాలని ఉక్కు అధికారులతో పాటు కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అయితే వారి నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈనెల 11వ తేదీకి కేసు వాయిదా వేసినట్టు ఆమె తెలిపారు.

బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకం


సాయిలిఖితను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బలరామకృష్ణ తదితరులు

గాజువాక: గత నెల 27 నుంచి 30 వరకు విజయవాడలో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 అంతర జిల్లాల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక శ్రీకృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థి జి.సాయిలిఖిత బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల చైర్మన్ బలరామకృష్ణ ,టీఎస్సార్ టీబీకే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.ప్రసాదరావు తదితరులు శనివారం అభినందించారు.

గంట్యాడలో అగ్ని ప్రమాదం

● రూ.5 లక్షల ఆస్తి నష్టం


ఎగిసి పడుతున్న మంటలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు గంట్యాడ పరిధి బాబూజగ్జీవన్‌రామ్ కాలనీలో శనివారం మధ్యాహ్నం ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది.. బాధితులు,స్థానికులు అందించిన వివరాలు.. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే దొర అనే వ్యక్తి భార్యతో కలసి బాబుజగ్జీవన్‌రామ్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అయితే శనివారం మ. ధ్యాహ్నం దొర భార్య హేమ వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో భయాందోళనకు గురై ఇద్దరూ బయటకు పరుగులు తీశారు.మంటలు కరెంట్ తీగలకు అంటుకోవడంతో పాల్ సీలింగ్‌తో పాటు ఫ్రిడ్జ్, టీవీ,ఇంట్లో ఉన్న వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు పెదగంట్యాడ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని స్థానికులు, బాధితులు చెబుతున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

తిరుమలనగర్ వాసులకు అభినందనలు


కాలనీ అసోసియేషన్ ప్రతినిధులను అభినందిస్తున్న మంత్రులు బాల వీరాంజనేయస్వామి, నారాయణ

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ కాలనీవాసులు, అసోసియేషన్ ప్రతినిధుల సమష్టి కృషితో కాలనీకి జాతీయ స్థాయిలో జలశక్తి అవార్డు దక్కిందని, దీన్ని స్ఫూర్తిగా తీసుకొని గేటెడ్ కమ్యూనిటీలు నీటి పొదుపును పాటించి పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర జలశక్తి అవార్డు దక్కించుకున్న తిరులమనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నగరంలో మంత్రులను కలిసి అవార్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు అవార్డు పొందిన అసోసియేషన్ ప్రతినిధులను అభినందించడంతో పాటు సత్కరించారు. నో ప్లాస్టిక్ జోన్, ఇంకుడు గుంతలు, విరివిగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడేవారమవుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, కార్పొరేటర్ బొండా జగన్, తిరుమల నగర్ అసోసియేషన్ ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందమ్, అప్పలనాయుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వాములకు నిత్య అన్నసమారాధన

అక్కిరెడ్డిపాలెం: కార్తీక మండల కాలాన్ని పురస్కరించుకొని శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి డిసెంబర్ 27వ తేదీ వరకు (బుధవారం, శనివారం) మినహా నిత్య అన్నసమారాధన నిర్వహించనున్నట్టు సేవా సంఘం అధ్యక్షుడు అదపాక వెంకటరమణ తెలిపారు. షీలానగర్‌లోని శ్రీ స్వామి అయ్యప్ప ఆలయంలో అన్నసమారాధనను దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిత్య బుధవారం అన్నసమారాధన శ్రీ మణికంఠ జ్యోతి భక్త సేవా సంఘం, నిత్య శనివారం అన్నసమారాధనను శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయ సమితి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ వారోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉక్కు ఎల్‌డీసీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్గీస్ 'జాతి శ్రేయస్సు కోసం సమగ్రత యొక్క సంస్కృతి' అనే అంశంపై ప్రసంగించారు. సమగ్రత, వ్యక్తిగత నైతికత, నైతిక ప్రవర్తనల మధ్య లోతైన సంబంధాన్ని ఆయన వివరించారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్. కరుణరాజు మాట్లాడుతూ ప్రజా విశ్వాసాన్ని పెంపొందించడానికి పారదర్శకత, జవాబుదారీతనం అవసరమన్నారు. వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు గణేష్, జి.వి.ఎస్. ప్రసాద్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. స్థానికంగా శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కావాలనే నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయన్నారు. ప్యాకేజీలు ఇస్తున్నామని ప్రచారం చేస్తూ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరిచేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పూర్తిగా రామెటీరియల్ అందించాలని, సొంత గనులు కేటాయించాలన్నారు. ఉద్యోగుల సంక్షేమాలకు కోత విధించడం సరికాదన్నారు. సమయానికి జీతం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. స్టీల్ ప్లాంట్ చరిత్రలో జీతం ఇవ్వలేని సంఘటన ఎప్పుడూ జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఉక్కు యాజమాన్యం కార్మికులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ ప్యాకేజీల పేరిట కాలయాపన చేయకుండా తక్షణమే ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు వై.టి. దాస్, టి.వి.కె. రాజు, గంగాధర్, కె.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు ప్రారంభం

ఆలయాలకు పోటెత్తిన భక్తులు


ఉక్కు బీసీ గేటు శివాలయంలో పూజలు అందుకున్న శివయ్య


తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్టీబీఎల్ అధినేత బాలాజీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని శివాలయాలు శనివారం భక్తులతో పోటెత్తాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో సెక్టర్-6 శివాలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. బీసీ గేటు సమీప ఉమా సహిత రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద ఎత్తున పూజలు చేశారు. అనంతరం రుత్వికులు హోమాలు నిర్వహించారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కణితి, వడ్లపూడి కాలనీలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. స్థానిక త్రిశక్తి దేవాలయంలో సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో..

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కార్తీక మాస పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ కుటుంబ సమేతంగా దివ్య క్షేత్రంలో కార్తీక దీపం వెలిగించి ధ్వజస్తంభంపై ఏర్పాటు చేశారు.

– అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, మింది, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో శనివారం కార్తీక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

అగనంపూడిలో..

అగనంపూడి: కార్తీక మాసం మొదటి రోజును పురస్కరించుకొని అగనంపూడిలోని షిర్డీసాయి మందిరంలో ఘనంగా పూజలు జరిపించారు. మహిళా పారాయణ కమిటీ ఆధ్వర్యంలో విష్ణు సహస్ర పారాయణం, సాయి చాలీసా, లింగాష్టకం, హనుమాన్ చాలీసాతో పాటు పలు భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.రమణారెడ్డి, ధర్మాల వ్యాసశర్మ, సత్యలక్ష్మి, సత్యశ్రీదేవి, జి.లీలావతి, పి.పంకజం, సూరీడమ్మ, పద్మ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

నమో శివ రుద్రాయ

- భక్తి శ్రద్ధలతో కార్తీక పూజలు ప్రారంభం
- మణిమకుటం.. అప్పికొండ సోమేశ్వర ఆలయం
- 1400 ఏళ్ల చరిత్ర సొంతం
- దర్శించి తరిస్తున్న భక్తజనం


అప్పికొండ సాగర తీరం


అప్పికొండ ఆలయంలో పూజలందుకున్న సోమేశ్వరుడు

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయం పారిశ్రామిక ప్రాంతానికి మణిమకుటం.. 1400 ఏళ్ల చరిత గల ఈ దేవాలయం సముద్ర తీరంలో.. ముక్కోణపు ఆకారంలో కనిపిస్తుంది.. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండలో గల ఈ ఆలయం గాజువాక నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏటా కార్తీక మాసంలో సోమేశ్వర స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకుని తరిస్తున్నారు.

ఆలయ విశిష్టత

1400 ఏళ్ల కిందట కపిల మహర్షి తపస్సు చేసుకునేందుకు ప్రయాణం చేస్తుండగా ఈ సుందరమైన ప్రదేశం అతన్ని ఆకర్షించిందని ప్రతీతి. దీన్ని కపిల తీర్థంగా చేయాలని సంకల్పించాడు. ఇక్కడ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయ సమయం వరకూ 101 శివలింగాలను ప్రతిష్ఠించేందుకు పూనుకున్నారు. ఆ సమయం పూర్తయ్యేసరికి 100 లింగాలను మాత్రమే ప్రతిష్ఠించగలిగాడు. ఒక లింగం అప్పుగా మిగిలిపోవడంతో ఈ ప్రాంతానికి అప్పట్లో అప్పుకొండగా నామకరణం చేశారు. తర్వాత కాలంలో క్రమేపీ ఈ ప్రాంతం అప్పికొండగా ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఆ ఆలయంలో నాలుగు శివ లింగాలు మాత్రమే భక్తులకు దర్శనభాగ్యం, ప్రత్యక్ష దర్శనాలు కల్పిస్తున్నాయి. ఒక లింగం ఆలయ మరమ్మతుల సమయంలో విచ్ఛిన్నమైంది. మిగిలిన 95 లింగాలు కాల క్రమేణా భూగర్భంలో కలిసిపోయాయి. మొట్ట మొదటి వెలసిన శివలింగం అంతరాలయంలో ఉంటుంది. పరమేశ్వరునికి ఇష్టమైన రోజు సోమవారం ఈ లింగం ఉద్భవించడంతో స్వామి వారిని సోమేశ్వర స్వామిగా కొలుస్తున్నారు.

ప్రతి సోమవారం అర్చనలు

కార్తీక మాసంతో పాటు ప్రతి సోమవారం ఇక్కడ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు చేస్తుంటారు. భక్తుల స్వహస్తాలతోనే వీటిని జరిపిస్తూ ఉంటారు.

భారీగా అన్నదానాలు

కార్తీక మాసంలో ప్రతి సోమవారం ఆలయానికి సుమారు 5 వేల నుంచి 6 వేల మంది భక్తులు దర్శనాలకు వస్తుంటారు. వీరి కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు.

పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి

ఈ ఆలయం పర్యాటక ప్రాంతంగానూ ప్రసిద్ధి చెందింది. ఇక్కడి సోమేశ్వర స్వామి ఆలయ దర్శనాలకు వచ్చే భక్తులు రోజంతా ఇక్కడే గడిపేలా ఈ ప్రాంతం ఉంటుంది. ఆలయ సమీపంలోనే సాగర తీరం ఉంది. దీంతో ఈ ప్రాంతానికి ఉత్తరాంధ్ర నుంచి అనేక మంది కార్తీక మాసంలో వనభోజనాలకు వస్తుంటారు. సముద్ర తీరంలో ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతుంటారు.